క్లుప్తంగా

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



వెంకటాచలం: మండలంలోని పూడిపర్తి గ్రామంలో ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా ఈపూరు శరత్‌బాబు నియమితులయ్యారు. దేవస్థానం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసబాబు, ఈఓ శ్రీధర్‌నాయుడు సమక్షంలో శుక్రవారం సభ్యులుగా మానికల సుధ, ఏ సుమ, వై.వెంకటేశ్వర్లు, కె.అంజిబాబు, ఈ.స్వరూప, పి.సునీత, కె.జయమ్మ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

పాఠశాలలో దీపావళి వేడుకలు



పొదలకూరు: మండలంలోని బిరదవోలు పంచాయతీ చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు ఎం.సుధాకర్‌రావు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వివరించారు. దీపాలు వెలగించి పండగను జరుపుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

స్కూల్లో బాలికా దినోత్సవం



తోటపల్లిగూడూరు: మండలంలోని చిన్నచెరుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పేడూరు సెక్టార్ సూపర్‌వైజర్ లలితాంబ మాట్లాడుతూ బాలికలు తగిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఉన్నత చదువులపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు అనురాధ, లావణ్య, భవాని, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీస్సులు



ఇందుకూరుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వేణుంబాక మహీధర్‌రెడ్డి మేనకోడలు కావ్య, ఆదర్శ్ వివాహాన్ని నెల్లూరులోని ఓ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. వధూవరులను మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆశీర్వదించారు. పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఏబీ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామాయణ మహాకావ్యంపై ప్రవచనలు



కోవూరు: రామాయణ మహాకావ్యంపై ప్రవచనలను శివానంద గిరి మాతాజీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఇనమడుగులోని సత్యానంద ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరి తీర్థ, పురుషోత్తమ తీర్థ, రామకృష్ణ తీర్థ, కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

విడవలూరు: పెన్నా నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసును శుక్రవారం నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ముదివర్తిలో గల గాంధీ నగర్ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం.. ముదివర్తిలోని పెన్నా తీరంలో తనకు సొంత పొలం ఉందని చెప్పి, అందులో నుంచి మట్టిని తోలేందుకు అనుమతులున్నాయంటూ కొన్ని నెలలుగా తరలిస్తూ సొమ్ము చేసుకోసాగారు. ఈ తరుణంలో మట్టిని ట్రాక్టర్లలో ఈ నెల 13న తరలిస్తుండగా, గమనించిన కొందరు గ్రామస్తులు.. స్థానిక వీఆర్వోకు సమాచారమిచ్చారు. దీంతో ఘటన స్థలానికి చేరుకొని ఇసుక లోడ్ చేసిన మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్లలో ఇసుక కాకుండా తవట మట్టి ఉండటంతో రూ.పది వేల చొప్పున జరిమానాను తహసీల్దార్ చంద్రశేఖర్ విధించారు. మట్టి తరలించిన భూమి ప్రభుత్వానికి చెందిందని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నరేష్ కేసు నమోదు చేశారు.

గౌరవ వేతనం అందేదెన్నడో?

నియోజకవర్గంలో 76 మంది ఎంపీటీసీలు

- అమలుకాని ఎన్నికల హామీ
- అరకొరగా ఇచ్చేదే 15 నెలలుగా అందని వైనం



తోటపల్లిగూడూరు మండల పరిషత్ కార్యాలయం

తోటపల్లిగూడూరు: ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం పెంచుతామని ఎన్నికల సమయంలో చెప్పింది. అయితే ఇంత వరకు దాని గురించి పట్టించుకోలేదు. ఎంపీటీసీ సభ్యులు మొదటి నుంచి ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారు. ప్రజల చేత ఎన్నుకోబడినా వీరికి ఎలాంటి విధులు, నిధులుగా కేటాయించడం లేదు. అధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలే సభ్యులుగా ఉన్నారు. చాలామంది ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. కూలీ పనులకు వెళ్లేవారు కూడా ఉన్నారు.

పట్టించుకోకుండా..

ఎంపీటీసీలకు ప్రభుత్వం నెలకు రూ.3 వేలను గౌరవ వేతనంగా అందిస్తుంది. కూటమి అధికారంలోకి వస్తే ఈ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఈ హామీని పట్టించుకోలేదు.

అంతే కాకుండా రూ.3 వేల గౌరవ వేతనాన్ని సైతం ఇవ్వడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి గౌరవ వేతనం విడుదలయ్యేది.

నియోజకవర్గంలో ఎంపీటీసీల సంఖ్య	
తోటపల్లిగూడూరు	: 14
ముత్తుకూరు	: 16
పొదలకూరు	: 19
మనుబోలు	: 11
వెంకటాచలం	: 16

హామీని నెరవేర్చాలి



గౌరవ వేతనాన్ని పెంచుతామని ఎన్నికల ప్రచార సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా హామీ అమలుకు నోచుకోకపోడవం బాధాకరం.

– ఉప్పల స్వర్ణలత, మండల పరిషత్ అధ్యక్షురాలు, తోటపల్లిగూడూరు

ఆదేశాలు రాలేదు



ఎంపీటీసీ గౌరవ వేతనాల పెంపునకు సంబంధించి ఆదేశాలు రాలేదు. రూ.3 వేల వంతున 19 నెలలకు గౌరవ వేతనాలు అందించాల్సి ఉందని ఉన్నతాధికారులకు నివేదించాం. బడ్జెట్ రాగానే వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేయడం జరుగుతుంది.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ, తోటపల్లిగూడూరు

అన్నదాతలకు అవగాహన



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్తలు

తోటపల్లిగూడూరు: మండలంలోని పేడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాయలంలో శుక్రవారం ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ సమన్వయకర్త శివజ్యోతి మాట్లాడుతూ వరి సాగులో వచ్చే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త, విజయ్‌కుమార్ నాయక్, ఇఫ్కో ఫీల్డ్ మేనేజర్ లక్ష్మీనారాయణ, పేడూరు పీఏసీఎస్ అధ్యక్షుడు నారాయణ, డీసీ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సొసైటీ సభ్యులు శీనయ్య, ప్రవీణ్, సీఈఓ రమణమూర్తి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

- హౌసింగ్ పీడీ వేణుగోపాల్



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీడీ

పొదలకూరు: లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను సంబంధిత కాంట్రాక్టర్లు పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ వేణుగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని మహ్మదాపురం గ్రామంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పీడీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ 18 మంది గిరిజనులకు ఇళ్లను కేటాయించామన్నారు. కాంట్రాక్టర్ బేస్ లెవల్ వరకు పూర్తి చేశారన్నారు. అసంతృప్తిగా ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేయాల్సిందిగా ఆదేశించామన్నారు. పీడీ వెంట ఏఈ మహేష్ తదితరులున్నారు.

పోస్టాఫీస్ భవన మరమ్మతులకు నిధులు

- రూ.28 లక్షల మంజూరు



ముత్తుకూరు పోస్టాఫీస్ భవనం

ముత్తుకూరు(పొదలకూరు): పట్టణంలోని పోస్టాఫీస్ భవనం మరమ్మతులకు కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఇక్కడి భవనం శిథిలావస్థకు చేరుకుని శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఇటీవల పోస్టుమాస్టర్‌పై పెచ్చులు ఊడిపడి ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో నివేదికలు పంపగా రూ.28,94,600 అంచనాలతో రిపేర్లు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి.

బాక్సింగ్‌లో విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ చూపిన వారితో హెచ్‌ఎం తదితరులు

పొదలకూరు: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు రాజమండ్రి ఎస్‌కేవీటీ హైస్కూల్లో అండర్ 14, 17, 19 విభాగాల్లో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన విద్యార్థినులు బాక్సింగ్ విభాగంలో మొత్తం 8 మెడల్స్ సాధించారు. 28 సంవత్సరాల తర్వాత జిల్లాకు బంగారు పతకం లభించినట్టు పొదలకూరు హైస్కూల్ పీడీ దేవిక పేర్కొన్నారు. స్థానిక డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు రెండు రజత, నాలుగు కాంస్య పతకాలను సాధించారు. బి.రూప, కె.లీల (రజతం), స్వప్న ప్రియ, నిఖిత, పావని, జయశ్రీలు కాంస్య పతకాలను కైవశం చేసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శైలజ, దేవిక, జ్యోతి, దాతలు రఘురామిరెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి వారిని అభినందించారు.

భూ ఆక్రమణకు టీడీపీ నేత యత్నం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో తమ స్థలాన్ని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు టీడీపీ నేతలు యత్నిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు శుక్రవారం ఆరోపించారు. జొన్నవాడ ఆలయ ప్రధాన రోడ్డు సమీపంలో సుమారు 40 అంకణాల స్థలం 2015 నుంచి తమ ఆధీనంలో ఉందని, అయితే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు దాన్ని స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారని చెప్పారు. దీనిపై సబ్ రిజిస్ట్రార్ కోటేశ్వరమ్మకు వినతిపత్రాన్ని అందజేశారు. భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని బాధితులు బాలకృష్ణ, సాగర్, గిరికృష్ణ కోరారు.

భూ పంపిణీపై ఆర్డీఓ నోటీసులు

- అడంగళ్లలో పేర్లపై ఆధారాలు చూపాలి
- అసైన్మెంట్ పట్టాల్లేకుండా భూములెలా ఇచ్చారు?



ఇటీవల అందజేసిన నోటీస్

పొదలకూరు: రెండు దశాబ్దాల క్రితం అసైన్మెంట్ కమిటీ అనుమతి లేకుండా భూముల పంపిణీపై నెల్లూరు ఆర్డీఓ చర్యలకు ఉపక్రమించారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులను అందజేసి మీ వద్ద ఆధారాలుంటే సమర్పించాల్సిందిగా సూచించారు. ఈనెల 15వ తేదీన ఆర్డీఓ కోర్టుకు హాజరుకావాలని ఆదేశించారు. అయితే ఆరోజు ఆర్డీఓ అందుబాటులో లేకపోవడంతో తిరిగి మరో తేదీని నిర్ణయించి నోటీసులు అందజేయనున్నట్టు తెలిసింది. మండలంలోని బిరదవోలు పంచాయతీ చెర్లోపల్లి ఎద్దల కంచెగా పేరున్న ప్రభుత్వ భూమిలో సర్వే నంబర్లు 593 నుంచి 695 వరకు గ్రామానికి చెందిన కొందరికి 150 ఎకరాల భూమికి సంబంధించి అడంగళ్‌లో మాత్రమే పేర్లున్నాయి. ఈ వ్యవహారంపై చాలాకాలంగా కొందరు రెవెన్యూ ఉన్నత స్థాయి అధికారులను కలిసి వినతిపత్రాలను సమర్పించారు. ఈ నేపథ్యంలో ఆర్డీఓ స్పందించి సంబంధిత వ్యక్తులకు అసైన్మెంట్ కమిటీ అప్రూవల్ లేకుండా అడంగళ్‌లో పేర్లు ఎలా వచ్చాయని ప్రశ్నిస్తూ నోటీసులను జారీ చేశారు.

రెండు దశాబ్దాలుగా..

ఎద్దల కంచె భూములకు సంబంధించి రెండు దశాబ్దాలుగా వివాదాలున్నాయి. ఇక్కడ 250 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. 2011లో కొందరు రైతులు తాము అనుభవిస్తున్న భూములను ఒకే వ్యక్తికి వందెకరాలు అమ్ముకున్నారు. అంతకుముందు 2004లో బిరదవోలు గ్రామానికి చెందిన కొందరు సుమారు 150 ఎకరాల భూమికు సంబంధించి అడంగళ్ (అప్పట్లో వెబ్‌ల్యాండ్ విధానం లేదు)లో పేర్లు రాయించుకున్నారు. అయితే ఇందుకు సంబంధించి రెవెన్యూ కార్యాలయంలో ఎలాంటి రికార్డులు లేకపోవడం, అసైన్మెంట్ కమిటీ అప్రూవల్ అయ్యి పట్టాలు ఇవ్వకపోవడంతో రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసి భూములు పొందిన వారు ఆధారాలను చూపాలని నోటీసుల్లో పేర్కొన్నారు. దీనికితోడు భూములు పొందిన వారు ఇప్పటి వరకు వ్యవసాయం చేయకపోవడంతో అవి అడవిని తలపిస్తున్నట్టుగా తెలుస్తోంది. దీంతో భూములపై సమగ్ర విచారణ నిర్వహించి సరైన రికార్డులు లేకపోతే భూములు పొందిన వారి పేర్లను తొలగించే అవకాశం కూడా ఉందంటున్నారు. ఇక్కడ బయటి వ్యక్తులకు కూడా భూములు కేటాయించినట్టు అప్పట్లో అధికారులకు ఫిర్యాదులందాయి.

మరో నోటీస్ అందజేస్తారు

ఆర్డీఓ కార్యాలయం నుంచి బిరదవోలుకు చెందిన వారికి నోటీసులు అందజేయడం జరిగింది. ప్రభుత్వ కార్యక్రమాల వల్ల ఈనెల 15న ఆర్డీఓ అందుబాటులో లేరు. తిరిగి నోటీసులను అందజేసి తేదీని నిర్ణయించడం జరుగుతుంది. దాని ప్రకారం అడంగళ్‌లో పేర్లున్న వారు ఆధారాలను తీసుకుని ఆర్డీఓ కోర్టుకు హాజరుకావాల్సి ఉంటుంది.

– బి.శివకృష్ణయ్య, తహసీల్దార్, పొదలకూరు

బాల్య వివాహాలతో అనర్థాలు



కొడవలూరు: హైస్కూల్లో బాలికలకు అవగాహన



కొడవలూరు: కొత్తవంగల్లులో..

కొడవలూరు: బాల్య వివాహాలతో బాలికల్లో ఆరోగ్యపరంగా దుష్పరిణామాలు సంభవిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల పేర్కొన్నారు. బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కొడవలూరు హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలకు 18 ఏళ్లు నిండాకే వివాహం చేయాలని కోరారు. గుడ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎంఈఓ అంకయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు రమీజా, యాస్మిన్, నాగరాజమ్మ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ హైస్కూల్లో బాలికలకు ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా, హెచ్‌ఎం మోహన రామలింగయ్య, ఏఎన్‌ఎం సలోమి, పరిమళ తదితరులు పాల్గొన్నారు.
- మండలంలోని కొత్తవంగల్లు జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: ఇనమడుగు సెక్టార్ పరిధిలోని లేగుంటపాడు ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. వక్తృత్వ, చిత్రలేఖన, పోస్టర్ ప్రదర్శన పోటీలను జరిపి విజేతలకు బహుమతులను అందజేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ శారద, సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు అపర్ణ, మనీషా, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: మండలంలోని ఆదెమ్మసత్రంలో గల హైస్కూల్లో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ వేషధారణలతో విద్యార్థినులు హాజరయ్యారు. వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. బాల్యవివాహాలపై నృత్య ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. అనంతరం బహుమతులను అందజేశారు. బాల్యవివాహాల నిర్మూలన.. బాలికల విద్యా హక్కులపై అవగాహన కల్పించే నిమిత్తం గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: యల్లాయపాళెంలో..



కోవూరు: బహుమతుల ప్రదానం



ఇందుకూరుపేట: ఆదెమ్మసత్రంలో ర్యాలీ

23 నుంచి ఆందోళనలు



మాట్లాడుతున్న దామోదర్‌రావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల జీఓ విడుదల్లో జాప్యంపై రాష్ట్ర వ్యాప్త ఆందోళనలను ఈ నెల 23 నుంచి చేపట్టనున్నామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రావు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని యూనియన్ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. పదోన్నతులపై అనుమతులను ఆగస్ట్ 28న సీఎం చంద్రబాబు ఇచ్చారని, అయితే నేటికీ అమలు కాలేదని ఆరోపించారు. ఎలాంటి ఉద్యోగోన్నతుల్లేకుండానే రెండు వేల మంది రిటైరయ్యే అవకాశం ఉందని చెప్పారు. స్త్రీ శక్తి పథకంతో ఉద్యోగులు, ప్రయాణికుల ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగాలంటే మూడు వేల కొత్త బస్సుల కొనుగోలుతో పాటు పది వేల మంది ఉద్యోగుల అవసరం ఉంటుందని చెప్పారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు యుగంధర్, జిల్లా కార్యదర్శి ప్రసాద్, జోనల్ కార్యదర్శి దాసరి బాబూశామ్యూల్, శ్రీనివాసరెడ్డి, ఏడుకొండలు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లి సేవలో కాకాణి, నేదురుమల్లి



వెంకటగిరి రూరల్: వెంకటగిరి శక్తిస్వరూపిణి పోలేరమ్మ తల్లిని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈసీ సభ్యులు బొలిగర్ల మస్తాన్ యాదవ్, చిట్టేటి హరికృష్ణ, నియోజకవర్గ పరిశీలకురాలు కల్పలత, పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, వెంకటగిరి మండల అధ్యక్షులు కాల్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, బాలాయపల్లి మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజానికి కృషి

- కలెక్టర్ హిమాన్షు శుక్లా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హిమాన్షు శుక్లా తదితరులు

నెల్లూరు(అర్బన్): కుష్ఠు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు. కుష్ఠు వ్యాధి కేసులను గుర్తించి వైద్యం చేసేందుకు గానూ వచ్చే నెల 17 నుంచి 30 వరకు చేపట్టనున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను డీఎంహెచ్‌ఓ సుజాత, ఇతర అధికారులతో కలిసి కలెక్టరేట్లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కుష్ఠు రోగులు తగ్గినా, జిల్లాలో అక్కడక్కడా కొత్త కేసులు వెలుగుచూడటం బాధాకరమని, దీనిపై వైద్యశాఖ అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా టీబీ, ఎయిడ్స్, కుష్ఠు నియంత్రణాధికారి ఖాదర్‌వలీ, డీఈఓ బాలాజీ రావు, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులతో సమీక్ష



సీజీఎంకు పుష్పగుచ్ఛమిస్తున్న అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్, మెయింటెనెన్స్)గా నియమితులైన సురేంద్రరెడ్డి నగరానికి శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా విద్యుత్ భవన్‌లో అధికారులతో సమీక్షను నిర్వహించారు. విద్యుత్ సరఫరా, డిమాండ్, సబ్‌స్టేషన్ల నిర్వహణ, లైన్ల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛాన్ని ఎస్‌ఈ రాఘవేంద్రం, నోడల్ అధికారి శేషాద్రిబాలచంద్ర, ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, పరంధామయ్య, రమేష్‌చౌదరి, భానూనాయక్, బెనర్జీ, డీఈఈ అశోక్ అందజేసి అభినందనలను తెలియజేశారు.

స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



నెల్లూరు(అర్బన్): నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ, వైద్యాధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. సింహపురి స్కాన్ సెంటర్, ఆండాళ్ భాస్కర్, విజయ హాస్పిటళ్లు తదితర స్కానింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పీసీ, పీఎన్డీటీ చట్టం మేరకు నిబంధనలు పాటిస్తూ స్కానింగ్‌ను నిర్వహించాలని సూచించారు. స్కానింగ్ వివరాలను సంబంధిత ఫారమ్‌లో నమోదు చేసి వైద్యశాఖ కార్యాలయానికి ప్రతి నెలా రెండో తేదీన అందజేయాలని కోరారు. ప్రైవేట్ ఆస్పత్రులకొచ్చే రోగుల్లో ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే, అలాంటి వారిని ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేసి టీబీ పరీక్షలు చేసేందుకు సహకరించాలని పేర్కొన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ చేజర్ల సుధాకర్‌రావు, పబ్లిక్ ప్రైవేట్ మిక్స్ కో ఆర్డినేటర్ హరీష్, విజయ్, ఫీల్డ్ కో ఆర్డినేటర్ సరిత తదితరులు పాల్గొన్నారు.